క్లుప్తంగా

ముక్కంటి సేవలో సినీనటుడు రాజశేఖర్



రాజశేఖర్ దంపతులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని బుధవారం ప్రముఖ సినీనటుడు రాజశేఖర్, జీవిత దంపతులు దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ



భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న ఉన్నం వాసుదేవనాయుడు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం పొయ్య పంచాయతీ రామానాయుడు ఎస్టీకాలనీ వాసులకు ఎంపీపీ ఉన్నం నిర్మల, వాసుదేవనాయుడు బుధవారం భోజనం ప్యాకెట్లు అందజేశారు. అంతే కాకుండా ఉదయమే రామానాయుడు ఎస్టీకాలనీకి వెళ్లి గుడిసెల్లో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో వీపీఎస్ బృందం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల పాత్ర కీలకం

భాకరాపేట: గ్రామాభివృద్ధిలో పంచాయతీ ఉప సర్పంచులు, వార్డు సభ్యుల పాత్ర కీలకమని చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ గిడ్డయ్య అన్నారు. బుధవారం రెండో రోజు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో భాగస్వాములు కావాలన్నారు.

రోజంతా జడి
నీట మునిగిన వరి

శ్రీకాళహస్తి: పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న బాధితులు



ఏర్పేడు: కొత్తవీరాపురం కాజ్‌వేపై నీటి ప్రవాహం



ఏర్పేడు: వికృతమాల వానకాల్వలో నీటి ప్రవాహం



శ్రీకాళహస్తిరూరల్: ముల్లపూడి గిరిజన కాలనీలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



అల్పపీడన ప్రభావంతో సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు రోజంతా జడి వాన కురుస్తోనే ఉంది. ఎడతెరపి లేకుండా వర్షంతో జనజీవనం స్తంభించింది. వంకలు, వాగులు, నదులు ఉధృతంగా ఉప్పొంగాయి. పంటపొలాలు నీట మునిగాయి.

- స్తంభించిన జనజీవనం
- పలు ప్రాంతాలు జలమయం
- విద్యుత్‌కు అంతరాయం
- శ్రీకాళహస్తిలో 84.4 మి.మీ వర్షం

శ్రీకాళహస్తి : తుఫాన్ ప్రభావంతో శ్రీకాళహస్తిలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం వరకు 84.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నీరు ఎక్కడ పడితే అక్కడ నిలిచిపోయింది. ధర్మరాజుల గుడి చెరువును తలపించేలా వర్షం నీటితో నిండిపోయింది. చెంచులక్ష్మికాలనీ, ఈదులగుంట, బృందమ్మకాలనీ, గోపాలకృష్ణారెడ్డి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో అన్ని కాజ్ వేల వద్ద గస్తీ ఏర్పాటు చేశామని తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. తొట్టంబేడు మండలం పొయ్యి సమీపంలోని రామానాయుడు ఎస్టీకాలనీలో వర్షం నీరు చేరడంతో కాలనీలోని 123 మందిని, గణపతినగర్ ఎ స్టీ కాలనీలోని 106 మందిని పునరావాసకేంద్రానికి తరలించినట్లు తహసీల్దార్ మదనమోహన్ తెలిపారు.

ఎడతెరిపిలేని వర్షం

శ్రీకాళహస్తి రూరల్: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. శ్రీకాళహస్తి -ముసలిపేడు రహదారి వేడం వద్ద రహదారి దెబ్బతినడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. శ్రీకాళహస్తి- ముచ్చివోలు- వెంకటగిరి మార్గంలో ఉడమలపాడు వద్ద లో లెవల్ బ్రిడ్జి పైన వరద నీరు పొంగిపొర్లుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నారాయణపురం పంచాయతీ ముల్లపూడి గిరిజన కాలనీలో ఇళ్లలోకి నీరు చేరిపోవడం వల్ల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.



బుచ్చినాయుడుకండ్రిగ: కారణి గ్రామంలో నీట మునిగిన వరిపంట



చెరువును తలపిస్తున్న వరి పొలం





బుచ్చినాయుడుకండ్రిగ: కల్వర్టును పరిశీలిస్తున్న అధికారులు, ఉధృతంగా ప్రవహిస్తున్న ఏడుగండ్లు వారధి కాలువ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి, వెస్టువరత్తూరు, నెలవాయి, కనమనంబేడు, కల్లివెట్టు, తలారివెట్టు, వేణుగోపాలపురం, కమ్మవారికండ్రిగలో సుమారు 2500 ఎకరాల్లో వరి పంట నీట మునిగి దెబ్బతింది. కనమనంబేడులో 450 ఎకరాల్లో వేసిన వరివిత్తనాలు పూర్తిగా దెబ్బతినడంతో రూ. 15 లక్షలకు పైగా నష్టం వట్టిల్లింది.

ఉధృతంగా ప్రవహిస్తున్న కాళంగి నది, కాలువలు

మండలంలోని కాళంగి నదిలోకి వర్షపు నీరు భారీగా చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నది పరివాహక ప్రాంతంలోని పొలాల్లో విద్యుత్ మోటార్లు, పంటలు దెబ్బతిన్నాయి. అలాగే చీటికాలువ, పందికాలువ, కారణివేరు, ఏడు, రెండు గండ్లు వారధి కాలువలు ఉధృతంగా పారుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. శ్రీకాళహస్తి-తడ రోడ్డు జలమయం కావటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో సరఫరాకు అంతరాయం కలిగింది.

ఏర్పేడు: మండలంలోని వికృతమాల ఎస్సీ కాలనీ వద్ద వానకాల్వలో నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. గుడిమల్లం సీతకాల్వ, కొత్తవీరాపురం సమీపంలో స్వర్ణముఖి నదిపై ఉన్న కాజ్‌వే నీటి ఉధృతి పెరగడంతో ఆయా గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు రోడ్లకు అడ్డంగా ముళ్లకంపలు వేశారు. చిందేపల్లి, చింతలపాళెం ఎస్టీ కాలనీలు నీట మునిగాయి. తహసీల్దార్ భార్గవి, ఎంపీడీఓ సౌభాగ్యం ఆయా గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలను తరలించారు.

కృష్ణాపురంలో నీట మునిగిన వరి

నాగలాపురం: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో 15 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. కొందరు రైతులు సాగునీటి కాలువను పూడ్చి వేయడంతోనే వర్షపునీరు పొలాల పైకి వచ్చిందన్నారు.

దెబ్బతిన్న రోడ్డు, కల్వర్టు పరిశీలన

దెబ్బతిన్న కేటీరోడ్డుతోపాటు కల్వర్టును బుధవారం తహసీల్దారు సుబ్రమణ్యం, ఎస్ఐ విశ్వనాథనాయుడు, డీటీ చంద్రబాబునాయుడు పరిశీలించారు.

వైభవంగా ఊంజల్‌సేవ



స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోస్వామి అమ్మవార్లకు బుధవారం రాత్రి ఊంజల్‌సేవ వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ఆలయ అలంకార మండపంలో విశేష అభిషేకాలు చేశారు. విశేషాలంకరణ చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. కాగా బుధవారం వర్షం కురుస్తుండటంతో ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపంలో జరగాల్సిన వేడుక ఆలయంలోని అలంకార మండపంలో నిర్వహించారు.

టీసీఎల్‌లో తప్పిన పెనుప్రమాదం

ఏర్పేడు: మండలంలోని వికృతమాల రెవెన్యూలో ఉన్న టీసీఎల్ కంపెనీలో బుధవారం పెనుప్రమాదం తప్పింది. టీసీఎల్ కంపెనీలో టీటీసీ విభాగంలోని లైన్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో అకస్మాత్తుగా దట్టమైన పొగలు అలుముకోవడంతో సైరన్ మోగింది. దీంతో కార్మికులకు భయభ్రాంతులకు గురై ఫ్యాక్టరీ నుంచి వెలుపలికి వెళ్లారు. సిబ్బంది కర్మాగార యాజమాన్యానికి సమాచారం అందించారు. యాజమాన్యం తిరుపతి అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పొగలను అదుపు చేశారు. అనంతరం టీటీసీ విభాగంలో కార్మికులు యథాతథంగా విధులు నిర్వహించారు.

స్వర్ణముఖికి జలకళ



స్వర్ణముఖి నదిలో చేరిన వరదనీరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో మూడు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. దీంతో స్వర్ణముఖి నది జలకళ సంతరించుకుంది. బుధవారం రాత్రి వరకు బోసిపోయిన స్వర్ణముఖి నది ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో నీరు రాత్రికల్లా స్వర్ణముఖి నదికి చేరింది.

వాన వరదైంది.. ఊరు చెరువైంది!



జ్యోతిరావ్ పూలే కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు



రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలో వర్షపు నీరు

రేణిగుంట: మండలంలో కురుస్తున్న వర్షాలతో జనజీవనం అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు వాగులుగా మారాయి. ఇళ్లు నీట మునిగాయి. ఇళ్లలో చేరిన వర్షపునీటిని తోడుతూ రాత్రంతా పస్తులతో జాగారం చేశారు. అలాగే మండలంలోని కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్ట సమీపంలో ఉన్న మల్లిమడుగు రిజర్వాయర్‌కు వర్షపునీరు భారీగా వచ్చి చేరుతోంది. పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీ, జ్యోతిరావ్ పూలే కాలనీ, వివేకానంద కాలనీ, రైల్వే స్టేషన్ ప్రాంగణం, చెక్‌పోస్ట్ అండర్ గ్రౌండ్ వంతెన, రామకృష్ణాపురం సమీపంలోని పాత విమానాశ్రయ మార్గం, అత్తూరు, నల్లపాళెం, అన్నాసామిపల్లి, కుర్రకాలువ పద్మానగర్ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రేణిగుంట భగత్‌సింగ్ కాలనీ సమీపంలోని వాగు ఉప్పొంగి ప్రవహించింది. ఇళ్లలోకి నీరు చేరాయి. దీంతో సర్పంచ్ నగేషం సంత సమీపంలో కాలువకు అడ్డుగా ఉన్న కల్వర్టును జేసీబీ సాయంతో పగులగొట్టారు. అలాగే మండలంలోని దొడ్లమిట్టలో వీధుల్లోకి నీరు చేరి పొలాల మీదుగా ప్రవహించాయి. దీంతో రాక,పోకలకు స్థానికులు ఇబ్బందిపడ్డారు. రేణిగుంట రైల్వే స్టేషన్ ప్రాంతం నీటిమడుగును తలపించింది.



సత్యవేడు-కదూరు రోడ్డులోని యానాదివెట్టు వద్ద బావులను తలపిస్తున్న ఆర్ అండ్ బీ రోడ్డు

వరదయ్యపాళెం: మండలంలో మూడు రోజులుగా వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. దీంతో జనజీవనం స్తంభించింది. దీంతో రైతులు, ఇతర రోజువారీ కూలీలు, చేతి వృత్తుల వారు పనులు చేసుకోలేక ఇబ్బందిపడుతున్నారు. మండలంలోని సంతవేలూరు మార్గంలో పులిబొంద, మార్లమడుగు, వరదయ్యపాళెంలో గోవర్ధనపురం వంతెన వద్ద నీటి ఉధృతి ఎక్కువ కావడం రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రానికి సైతం సందర్శనకు వచ్చే పర్యాటకులను లోనికి వెళ్లనియ్యకుండా నిషేధించారు.

వాయిదా పడిన మండలమీట్

బుధవారం జరగాల్సిన మండల మీట్ వాయిదా పడింది. వర్షాల కారణంగా ఎంపీటీసీలు, సర్పంచులు సర్వసభ్య సమావేశానికి చేరుకోలేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

బుధవారం అర్ధరాత్రి వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు వాయుగుండం తీరం దాటే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ రాజశేఖర్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని పెద్ద పాండూరు, మత్తేరిమిట్ట, చిన్న పాండూరు గ్రామాల్లో పర్యటించి వర్షాలపై అప్రమత్తం చేశారు. అలాగే బీజీఆర్‌కాలనీ, మత్తేరిమిట్ట గిరిజనులకు భోజన ఏర్పాట్లను చేపట్టినట్లు తెలిపారు.

మా గోడు పట్టించుకోరా..

రాత్రి నుంచి వాగు నీళ్లు ఊరిమీదకొచ్చి మా ఇంట్లో ప్రవాహం కొట్టుకొచ్చింది. వస్తు సామగ్రి, అన్నీ తడిచిపోయాయి. ఏ సమయాన ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని తిండి,తిప్పలు లేకుండా రాత్రంతా జాగారం చేస్తూ ఇంట్లో చేరిన నీటిని తోడి బయట పోస్తూనే ఉన్నాం.. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి. పాలకులు ఏమి చేస్తున్నారు... దీనికి శాశ్వత పరిష్కారం చూపరా.. మా గోడు ఎవ్వరు పట్టించుకుంటారు.

లక్ష్మీదేవి, జ్యోతిరావ్ పూలే కాలనీ, రేణిగుంట.





వరదయ్యపాళెం పెట్రోల్ బంకు వద్ద గ్యాస్ పైపులైను కోసం తవ్వి వదిలేసిన కాలువలో నిలిచిన నీరు



వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం వద్ద వంతెనపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



వరదయ్యపాళెం మండలం కదూరు ప్రాంతంలో నీట మునిగిన పొలాలు



రేణిగుంట భగత్‌సింగ్ కాలనీలో ఇళ్లను ముట్టడించిన వర్షపు నీరు



పాత రేణిగుంట సమీపంలో చెరువును తలపిస్తున్న పొలాలు



రేణిగుంట మండలం దొడ్లమిట్టలో వీధిలో వరద నీరు

పచ్చ సిండి'కేట్లు'

- ఇష్టారాజ్యంగా మద్యం వ్యాపారం ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలో 12 మద్యం దుకాణాలుండగా తెలుగుదేశం నాయకులు సిండికేట్ అయ్యి, అన్ని తమకే రావాలని భయభ్రాంతులకు గురి చేసి ఎవరిని డీడీ కట్టకుండా అడ్డుకున్నారు. పట్టణంలోని 12 దుకాణాలు సమస్యాత్మ ప్రాంతాలైన భేరివారి మండపం, బలరామ్ థియేటర్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికలు ధర్నాలు చేసి దుకాణాలు మూయించారు. అయితే టీడీపీ నాయకులు ఆ ప్రాంతాల్లోనే మళ్లీ దుకాణాలను తెరిచారు. భేరివారి మండపం సమీపంలో పెట్టిన దుకాణం వద్ద వాహనాలు పెట్టుకునేందుకు కూడా స్థలం కూడా ఉండదు. అంతే కాకుండా ఆ రోడ్డు చాలా ఇరుగ్గా ఉండటం వల్ల అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తే ఆర్టీసీ బస్సులు పోవడానికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. అవేమి పట్టని పచ్చనేతలు తమ ఆదాయమే ధ్యేయంగా ప్రజల మనోభావాలు పట్టించుకోకుండా ఎక్కడ పడితే అక్కడ దుకాణాలు పెట్టేందుకు సిద్ధమయ్యారు. దీంతో భేరివారిమండపం ప్రాంతం మద్యంబాబులతో నిండిపోవవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. తొట్టంబేడు మండలంలో 75 షాపు నంబర్ మోహన్ అనే వ్యక్తి తనకు వచ్చిన దుకాణాన్ని వెనక్కి ఇచ్చేసినట్లుగా ఎక్సైజ్‌సీఐ లావణ్యకు అర్జీ సమర్పించాడు. ఆ దుకాణాన్ని మళ్లీ తెరిచేందుకు టెండర్ పిలవాల్సిందిగా ఉన్నతాధికారులకు పంపించామన్నారు. ఇలా టీడీపీ నాయకులు సిండికేట్‌గా మారి గతంలో ప్రభుత్వానికి వస్తున్న మద్యం ఆదాయాన్ని పంచుకునేందుకు సిద్ధమయ్యారు.

ఎట్టకేలకు కాలువలు శుభ్రం

శ్రీకాళహస్తి: ఎట్టకేలకు శ్రీకాళహస్తిలోని పలు కాలువలను అధికారులు శుభ్రం చేయించారు. శ్రీకాళహస్తిలోని చెంబేడు కాలువ, కన్నలి కాలువ, గొడ్డేరు కాలువలో చెత్త పేరుకుపోయిందని సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం అయిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు యుద్ధ ప్రతిపాదికన ఆయా కాలువల్లో చెత్తను తొలగించారు. దీంతో నీరు సజావుగా పోతోంది. ప్రజలు సాక్షి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



కన్నలికాలువలో చెత్త తొలగిస్తున్న జేసీబీ